ప్రజాశక్తి

శనివారం 8 ఫిబ్రవరి 2025

5

పార్వతీపురం మన్యం



పార్వతీపురం కమిషనర్‌గా వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

స్థానిక మున్సిపల్ కమిషనర్‌గా సిహెచ్.వెంకటేశ్వర్లును నియమిస్తూ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్మెంట్ డిపార్ట్మెంట్, ఆంధ్రప్రదేశ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కార్యాలయం నుంచి శుక్రవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న కె.శ్రీనివాస్ గత ఏడాది అక్టోబర్‌లో బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో పి.శాంతకుమారిని కమిషనర్‌గా నియమించేందుకు ఉత్తర్వులు వచ్చినప్పటికీ, ఆమె విధుల్లో చేరకుండా సెలవు పెట్టడంతో ఐదు నెలలుగా ఇన్‌ఛార్జ్ కమిషనర్, ఎఫ్ఎసి కమిషనర్లతోనే పాలన సాగింది. ప్రస్తుతం ప్రభుత్వ ఉత్తర్వులతో సిహెచ్ వెంకటేశ్వర్లు రెగ్యులర్ కమిషనర్‌గా ఎప్పుడు బాధ్యతలు తీసుకుంటారో వేచి చూడాల్సిందే.

ఎంఎస్‌ఎంఇ సర్వే లక్ష్యాలు సాధించాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

జిల్లాలో చేపడుతున్న ఎంఎస్ఎంఇ (సూక్ష్మ, చిన్న, మరియు మధ్య తరహా సంస్థలు) సర్వే సకాలంలో పూర్తిచేయాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. ప్రతి సచివాలయ పరిధిలో రోజుకు ఐదు ఎంఎస్ఎంఇల సర్వే చేయాలని లక్ష్యాలను నిర్దేశించడం జరిగిందని, ఆ దిశగా సర్వే జరగాలని కలెక్టర్ తేల్చి చెప్పారు. జియ్యమ్మవలస తహశీల్దార్ కార్యాలయాన్ని కలెక్టర్ శుక్రవారం సందర్శించారు. అక్కడ జియ్యమ్మవలస సచివాలయ సిబ్బందితో సమీక్షించారు. ఈ సందర్భంగా ఎంఎస్ఎంఇల సర్వేపై వివరాలను సిబ్బందిని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఇచ్చిన లక్ష్యాలను సకాలంలో పూర్తిచేయాలని, ఇందులో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించబోమని కలెక్టర్ తేల్చిచెప్పారు. అనంతరం ప్రధానమంత్రి జన్‌మన్, లే అవుట్లలో బేస్మెంట్ స్థాయిలో ఉన్న గృహ నిర్మాణాలపై కలెక్టర్ సమీక్షించారు. లబ్ధిదారులను చైతన్యపరచి ఇళ్లు నిర్మించుకొనేలా చూడాలని పిలుపునిచ్చారు. తొలుత బిజెపురంలోని లోతువానివలసలో రూ.80 లక్షలతో ప్రారంభించనున్న రహదారి పనులను కలెక్టర్ పరిశీలించి, ఉప కార్యనిర్వాహక, సహాయ ఇంజినీర్లకు, గుత్తేదారునికి పలు సూచనలు చేశారు.



ఇళ్ల నిర్మాణాలపై గ్రామస్తులతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

రెవెన్యూ సేవలు పెండింగ్ ఉండరాదు: కలెక్టర్

ప్రజలకు అవసరమైన రెవెన్యూ సంబంధిత సేవలను పెండింగ్‌లో ఉంచకుండా నిర్ణీత వ్యవధిలోగా అందించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. తహశీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేసిన ఆయన మ్యూటేషన్ల పరిష్కారం, రెవెన్యూ రికార్డుల నిర్వహణ, తదితర అంశాలను పరిశీలించారు. రెవెన్యూ సేవలందించడంలో సిబ్బందికి ఉన్న పరిజ్ఞానంపై ప్రశ్నించారు. సరైన సమాధానం రాకపోవడంతో కొంత అసహనాన్ని వ్యక్తం చేశారు. పనితీరు పట్ల అసంతృప్తి వ్యక్తం చేసి విధుల్లో నిర్లక్ష్యం వహించిన వారికి కఠిన చర్యలు తప్పమని హెచ్చరించారు. వచ్చే వేసవిని దృష్టిలో పెట్టుకుని నీటి ఎద్దడి సమస్య రాకుండా ముందస్తుగా గ్రామాల్లో తాగునీటి బోరు బావులు పనితీరు పరిశీలించాలని, జల జీవన్ మిషన్ కింద చేపడుతున్న ఇంటింటికి తాగునీటి కుళాయిల పనులను వేగవంతం చేయాలని గ్రామీణ నీటి సరఫరా అధికారులను ఆదేశించారు. రబి సీజన్ వరి సాగు, నీటి లభ్యత, దిగుబడి విషయాలను వ్యవసాయ అధికారులను అడిగి ఆరా తీశారు. అనంతరం పల్లె పండుగ కింద సిగబడి నుంచి లోతువానివలస వరకు సుమారు వ్యయం రూ.కోటీ 40 లక్షలతో మంజూరైన రహదారి పనులు ఇప్పటి వరకు మొదలు కాకపోవడంతో పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్ణీత గడువులోగా నిర్మాణాలు పూర్తి కాకపోతే నిధులు వెనక్కి తరలిపోయే ప్రమాదం ఉందని, నిర్లక్ష్యం వహించిన వారిని ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. తక్షణమే రహదారి పనులను వేగవంతం చేయాలని అన్నారు. కార్యక్రమంలో ఇన్చార్జి తహశీల్దార్ రెడ్డి పకీరు, ఎంపిడిఒ ఎస్.రమేష్, పంచాయతీరాజ్ జెఇ ఎం.పార్థసారధి, గ్రామ సచివాలయ, రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఏజెన్సీ బంద్‌కు సిపిఎం మద్దతు

కార్పొరేట్లకు మేలు చేయడానికే 1/70 చట్ట సవరణకు కుట్ర

జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు

ప్రజాశక్తి - పార్వతీపురం

ఏజెన్సీ ప్రాంతానికి రక్షణ కవచంలా ఉన్న 1/70 చట్టాన్ని సవరణ చేయాలని సాక్షాత్తూ అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు చేసిన వ్యాఖ్యలకు నిరసనగా ఈనెల 11,12 తేదీల్లో ఆదివాసీ గిరిజన సంఘం చేపడుతున్న ఏజెన్సీ బంద్‌కు మద్దతు తెలుపుతున్నట్లు సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగు నాయుడు చెప్పారు. శుక్రవారం స్థానిక సుందరయ్య భవనంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మొత్తం అటవీ ఏజెన్సీ ప్రాంతాన్ని కార్పొరేట్లకు అప్పజెప్పడానికి తెలుగుదేశం, బిజెపి కూటమి ప్రభుత్వాలు పన్నాగం పన్నాయని, అందులో భాగమే స్పీకర్ వ్యాఖ్యలని అన్నారు. దేశంలో బిజెపి, ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత దేశం మొత్తంగా ఉన్న అటవీ ఏజెన్సీ ప్రాంతాన్ని కార్పొరేట్ పెట్టుబడిదారులకు అప్పజెప్పి గిరిజనులందర్నీ అడవుల నుండి తరిమేయడానికి చూస్తున్నారని చెప్పారు . అందులో భాగమే కాశ్మీర్లో 370 ఆర్టికల్ రద్దు, మణిపూర్లో మోయితి, కుకీ తెగలకు తగాదా సృష్టించడం వంటి చర్యలని విమర్శించారు. 1/70 చట్ట సవరణ జరిగితే గిరిజన ప్రాంతంలో గల విలువైన గనులు, కొండలు, అటవీ ప్రాంతమంతా కూడా కార్పొరేట్ వశం అవుతుందని స్థానికంగా ఉన్న వ్యాపారస్తులు కూడా అందులో వేలు పెట్టలేరని అన్నారు ఇప్పటికే విద్యుత్ హైడ్రో ప్రాజెక్టులు పేరుతో వేల ఎకరాల భూమిని ఆదానీ, అంబానీలకు కట్టబెడుతున్నారని, ఇక 1/70 చట్టం లేకపోతే మొత్తం అటవీ ప్రాంతం కార్పొరేటర్ల ధారాదత్తమవుతుందని అన్నారు. కాబట్టి వెంటనే తెలుగుదేశం కూటమి ప్రభుత్వం స్పీకర్ అయ్యన్న మాటలకు ప్రభుత్వానికి సంబంధం లేదని ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఈనెల 11, 12 తేదీల్లో జరిగే ఆదివాసీ గిరిజన సంఘాల ఏజెన్సీ బంద్‌లో గిరిజనులకు అన్యాయం చేస్తున్న బిజెపి పాల్గొంటుందని, పీక కోసిన వాడే వైద్యం చేస్తాను అన్నట్లు బిజెపి వరస ఉందని ఎద్దేవా చేశారు. ఇది గిరిజనులను వంచించడమేనని, వెంటనే గిరిజనుల హక్కులన్నీ కాపాడతామని, అటవీ ప్రాంతంలోకి కార్పొరేట్లను అనుమతించమని బిజెపి పార్లమెంట్‌లో ప్రకటించాలని డిమాండ్ చేశారు. లేకుంటు బిజెపి అనుబంధ సంఘాల్లో గల గిరిజనులు ఆలోచించాలని కోరారు. ఈ సమస్యలపై రానున్న రోజుల్లో గిరిజనులందర్నీ కదిలించి పెద్ద ఎత్తున ప్రజాసంఘాల ఆధ్వర్యంలో పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. విలేకరుల సమావేశంలో సిపిఎం నాయకులు వి.ఇందిర, గొర్లె వెంకటరమణ, బివి రమణ పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి గంగునాయుడు

ఆప్కోస్ రద్దు అనాలోచిత నిర్ణయం

ఎపి రాష్ట్ర ప్రభుత్వ కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్, టీచర్స్, వర్కర్స్ జెఎసి చైర్మన్

ప్రజాశక్తి - సాలూరు

టిడిపి కూటమి ప్రభుత్వం ఆప్కోస్ రద్దు చేస్తామనడం అనాలోచిత నిర్ణయమని ఎపిరాష్ట్ర ప్రభుత్వ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఎంప్లాయీస్, టీచర్స్ అండ్ వర్కర్స్ జెఎసి చైర్మన్ ఎవి నాగేశ్వరావు అన్నారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో ఆప్కాస్ ద్వారా అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగుల భర్తీ జరిగిందని, దీని వల్ల వారికి పిఎఫ్,ఇఎస్ఐ ఖాతాల్లో సకాలంలో డబ్బులు జమయ్యేవని చెప్పారు. అయితే ఇప్పుడు ప్రయివేటు ఏజెన్సీల ద్వారా అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగుల భర్తీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించడం వల్ల వారికి నష్టదాయకమేనని చెప్పారు. ప్రయివేటు ఏజెన్సీ లు సరిగ్గా జీతాలు చెల్లించే అవకాశం లేదని చెప్పారు. ప్రస్తుతం ఆప్కాస్ లో లక్షా పదివేల మంది పని చేస్తున్నారని చెప్పారు. ఇలాంటి పరిస్థితుల్లో ఆప్కాస్ రద్దు చేస్తే ఉద్యోగులు పెనం మీద నుంచి పొయ్యిలో పడ్డట్టే అవుతుందని చెప్పారు. గతంలో బొబ్బిలి ఎన్నికల ప్రచారంలో భాగంగా సిఎం చంద్రబాబు నాయుడు చెప్పిన మాటలు ఉద్యోగులకు ఇంకా గుర్తున్నాయని చెప్పారు. అవుట్ సోర్సింగ్ నుంచి కాంట్రాక్టు పద్ధతిలోకి కలపాలని, ఉద్యోగులు కోరినప్పుడు ఇచ్చిన హామీల గురించి మరిచిపోలేదని చెప్పారు. తక్షణమే ఆప్కాస్ రద్దు నిర్ణయం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే భవిష్యత్తు పరిణామాలకు రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నాగేశ్వరరావు

పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థికి మద్దతు

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరేడ్ల విజయ గౌరి ని గెలిపించాలని కోరారు. జిల్లాలోని కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు, అధ్యాపకులు విజయ గౌరికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం జెఎసి కో చైర్మన్ బి.కాంతారావు,సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్వైనాయుడు పాల్గొన్నారు .

ఆశావాహ జిల్లాల్లో అగ్రస్థానంలో ఉండాలి

ప్రజాశక్తి -పార్వతీపురం

మన్యం జిల్లాను దేశంలోని ఆశావాహ జిల్లాల్లో అగ్రగామిగా నిలపాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అన్నారు. ఆశావాహ జిల్లాల విభాగంలో జిల్లాకు ప్రధానమంత్రి అవార్డు రావాలని అన్నారు. కలెక్టరేట్‌లో సంబంధిత శాఖలతో శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. గత త్రైమాసికంలో భామిని బ్లాక్ దక్షిణ భారతదేశంలోనే అగ్రస్థానంలో నిలిచిందని, ఇదే స్ఫూర్తిని బ్లాక్‌తో పాటు జిల్లాలోనూ కొనసాగించాలన్నారు. నీతి ఆయోగ్ మార్గదర్శకాలు, సూచికల ప్రకారం పనులు విజయవంతంగా పూర్తి చేశామని తెలిపారు. విద్య, ఆరోగ్యం, వ్యవసాయ రంగంలోని పనులను పరిగణనలోకి తీసుకోవచ్చున్నారు. గిరిజనులు ఉత్పత్తి చేసే పసుపు, చింతపండు, కొండ చీపుర్ల ఉత్పత్తులకు మార్కెటింగ్, బ్రాండింగ్, ప్యాకింగ్ చేయడం జరుగుతోందని, తద్వారా వారి జీవనోపాధి మెరుగుపడుతుందని ఉద్బోధించారు. అంగన్‌వాడీ చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు బాలామృతం అందజేస్తున్నామని, మరే రాష్ట్రంలోనూ పంపిణీ చేయని నాణ్యమైన వస్తువులను అందిస్తున్నామని తెలిపారు. యువత ఉన్నత విద్య, ఉద్యోగాలకు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు గ్రామాల్లో గ్రంథాలయాలు ఏర్పాటు చేశామన్నారు. పార్వతీపురంలో రూ.3 కోట్లతో ఇన్నోవేటివ్ హబ్‌ను ఏర్పాటు చేయబోతున్నట్లు తెలిపారు. వీటన్నింటిని పరిగణనలోకి తీసుకొని జాతీయ స్థాయిలో పోటీ పడే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. అలిమ్ కో సహకారంతో వికలాంగులకు అవసరమైన సహాయ ఉపకరణాలు అందజేస్తున్నామని, స్థానిక ప్రజల స్థితిగతులను మెరుగుపర్చేందుకు అనేక అవగాహన శిబిరాలు, శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. గడువులోగా పనులన్నీ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్.శోభిక, పార్వతీపురం, సీతంపేట ఐటిడిఎ పిఒలు అశుతోష్ శ్రీవాస్తవ, సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి, డిఆర్ఒ కె.హేమలత, డిఇఒ డాక్టర్ ఎన్.తిరుపతి నాయుడు, ఐటిడిఎ ఎపిఒ ఎ.మురళీధర్, భామిని బ్లాక్ కోఆర్డినేటర్ కె.మహేశ్వర్‌రావు, మెడికల్, హెల్త్ ప్రోగ్రాం అధికారి ఎం.వినోద్, విద్యుత్ సంస్థ ఎస్ఇ కె.చలపతిరావు, జిల్లా పరిశ్రమల అధికారి ఎం వి కరుణాకర్ తదితరులు హాజరయ్యారు.



ఫిర్యాదుదారులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎఎస్‌పి అంకిత సురాన

పరస్పర ఫిర్యాదులపై ఎఎస్‌పి విచారణ

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

మండలంలోని పెదబొండపల్లిలో ఈనెల 1న దళితులకు సంబంధించిన భూముల్లో కొంతమంది చేసిన ఆక్రమణలు, గ్రామానికి చెందిన దళితులతో కలిసి ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర తొలగించిన సంఘటనలో పరస్పరం చేసుకున్న ఫిర్యాదులపై ఎఎస్‌పి అంకిత సురాన విచారణ నిర్వహించారు. ఈ మేరకు శుక్రవారం పెదబొండపల్లి గ్రామ సచివాలయంలో ఎఎస్‌పి రూరల్ ఎస్సై సంతోషికుమారితో కలిసి విచారణ నిర్వహించారు. ముందుగా వివాదానికి కారణమైన భూమికి సంబంధించిన 24 మంది దళిత కుటుంబాలను, ఫిర్యాదు దారుడైన కంది యోహాను పిలిపించి వారితో మాట్లాడి వారికి భూమిపై గల హక్కు పత్రాలను పరిశీలించారు. అనంతరం వివాదానికి కారణమైన సంఘంవలస రెవెన్యూ పరిధిలోని వ్యవసాయ క్షేత్రాన్ని పరిశీలించి పరిసర రైతులతో మాట్లాడి సంఘటనపై దర్యాప్తు నిర్వహించారు. ఎఎస్‌పి మాట్లాడుతూ పరస్పర ఫిర్యాదుల్లో అంశాలైన భూమి హక్కు పత్రాలను, ఆక్రమణలను, అనుమతి లేకుండా వ్యవసాయ క్షేత్రంలోని పరికరాల ధ్వంసం, చొరబాటుతో పాటు అన్ని అంశాలపై సమగ్ర విచారణ చేపట్టి దోషులను గుర్తించి చర్యలకు సిఫార్సు చేస్తామని తెలిపారు. ఈ విచారణలో విఆర్ఒలు తిరుపతిరావు, కృష్ణారావు, కార్యదర్శి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణాలు సకాలంలో పూర్తి చేయాలి

ప్రజాశక్తి - కురుపాం

గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న మల్టీపర్పస్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ నిర్మాణాలు నాణ్యత ప్రమాణాలతో సకాలంలో పూర్తి చేయాలని ఇంజనీర్ ఇన్ చీఫ్ శ్రీనివాస్ ఆదేశించారు. మండలంలోని గొటివాడ పంచాయతీ భోరిలో రూ.60లక్షలతో నిర్మిస్తున్న మల్టీపర్పస్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ నిర్మాణాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. పనులు పరిశీలించిన సంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే సాకిగూడ, కోసింగూడ, కొత్తగూడ, దెప్పిగూడలో మంజూరైన భవనాలను కూడా ప్రారంభించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం కురుపాం ఏకలవ్య పాఠశాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఇఇ మణిరాజు, డిఇఇ చాణక్య, ఇంజనీరింగ్ సిబ్బంది దుర్గా, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఇంజినీరింగ్ సిబ్బందితో మాట్లాడుతున్న ఇఎన్‌సి .శ్రీనివాస్



నిరసన తెలుపుతున్న ఐద్వా నాయకులు, మహిళలు

ఒడిశా సిఎం వ్యాఖ్యలపై ఐద్వా నిరసన

ప్రజాశక్తి - సాలూరురూరల్

ఒడిశా ముఖ్యమంత్రి మోహన్ మాఝి గిరిజన మహిళల పట్ల చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని, ఈ వ్యాఖ్యలను ఐద్వా తీవ్రంగా ఖండిస్తుందని ఐద్వా సాలూరు పట్టణ నాయకులు జి.స్వప్న అన్నారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక రాజేశ్వరరావు పార్క్ వద్ద గిరిజన మహిళ పట్ల ఒడిశా సిఎం చేసిన అవమానకర మాటలను నిరసిస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా స్వప్న మాట్లాడుతూ సిఎం స్థాయి వ్యక్తి మహిళలను కించిపరుస్తూ, గిరిజన మహిళలు అందంగా ఉండరని, నల్లగా ఉంటారంటూ అవమానకరంగా మాట్లాడటం బిజెపికి, వారి నాయకత్వానికి కొత్తమీ కాదన్నారు. గతంలో క్రీడల్లో బ్రిడ్జ్ భూషణ్ పార్లమెంట్ సభ్యుడిగా ఉండి కూడా మహిళ క్రీడాకారులను వేధించగా, బిజెపి వెనకేసుకొచ్చిందని, ఇప్పుడు ఒడిశా సిఎం అదేదారిలో ఉన్నారని తెలిపారు. ప్రత్యేకించి బిజెపి ఒడిశాలో అధికారంలోకి వచ్చిన తర్వాత గిరిజనులు, మహిళల పట్ల అన్యాయంగా ప్రవర్తిస్తున్నారని వెంటనే ఈ వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని, లేకపోతే పెద్ద ఎత్తున ఆందోళన పిలుపునిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఐద్వా నాయకులు కౌసల్య, ఆదిలక్ష్మి, రాములమ్మ, శశిరేఖ, రాణి, పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు రాముడు పాల్గొన్నారు.

ప్రతిభా కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ఐటిడిఎ ఆధ్వర్యంలో నిర్వహించనున్న మల్లి ప్రతిభ కళాశాల పివిపిజి 2025 విద్యా సంవత్సరం గానూ ఇంటర్ మొదటి సంవత్సరం పివిటిజి గిరిజన విద్యార్థులు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలని ప్రాజెక్ట్ అధికారి సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. https://twreis-cet.apcfss.in వెబ్సైటుకు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు సీట్లు కేటాయింపు ప్రవేశ పరీక్ష మెరిట్ మార్కుల ఆధారంగా జరుగుతుందని తెలిపారు. శ్రీకాకుళం, పార్వతీపురంమన్యం, విజయనగరం, విశాఖపట్నం, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, తూర్పుగోదావరి, కాకినాడ, పశ్చిమగోదావరి, అంబేద్కర్ కోనసీమ, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాలకు చెందిన గిరిజన విద్యార్థులు చెందినవారై ఉండాలని తెలిపారు. మార్చి 2లోగా దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. ప్రవేశ పరీక్ష మార్చి 9న సీతంపేట గిరిజన గురుకుల బాలికల పాఠశాలలో జరుగుతుందని తెలిపారు.

ఇంటర్ ప్రయోగ పరీక్షల హాల్ టిక్కెట్లు సిద్ధం

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

జిల్లాలో ఇంటర్ ఎంపిసి, బైపిసి గ్రూపుల్లో చదువుతున్న విద్యార్థిని, విద్యార్థులకు ప్రయోగ పరీక్షల హాల్ టికెట్లను కళాశాల లాగిన్ లోను, ఇంటర్మీడియట్ బోర్డ్ వెబ్సైట్లో పొందుర్చినట్లు జిల్లా ఇంటర్మీడియట్ విద్యా అధికారి డి.మంజులవీణ శుక్రవారం ఒక ప్రకటన తెలిపారు. విద్యార్థులు తమ హాల్ టికెట్లను బోర్డు వెబ్సైట్లో ఆధార్ నెంబర్, పుట్టిన తేదీని నమోదు చేసి డౌన్లోడ్ చేసుకోవచ్చున్నారు. అలాగే 9552300009 వాట్సప్ నెంబర్‌కు ఎడ్యుకేషన్ సర్వీస్ ఆప్షన్‌ను సెలెక్ట్ చేసి అందులో గత హాల్ టికెట్ నెంబర్‌ను ఎంటర్ చేసి మార్చి 2025 హాల్ టికెట్‌ను డౌన్లోడ్ చేసుకొనే సదుపాయాన్ని కల్పించినట్లు తెలిపారు. ఇంటర్ విద్యార్థులు ప్రయోగపరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు.

పడకేసిన పారిశుధ్యం

- పర్యవేక్షణ లేని మున్సిపల్ కమిషనర్
- ఆరు నెలలుగా రెగ్యులర్ శానిటేషన్ అధికారి లేరు
- మంత్రి సొంత మున్సిపాలిటీ దుస్థితి

ప్రజాశక్తి - సాలూరు

మన్యం జిల్లాలో గల పురాతన మున్సిపాలిటీలో అభివృద్ధి ముందుకు మూడడుగులు వెనక్కి ఆరడుగుల అన్న చందంగా తయారైంది. గత ఆరు నెలలుగా పట్టణంలో పారిశుధ్యం తాండవిస్తోంది. దళితకాలనీ, మురికివాడల్లో పారిశుధ్యం మరీ అధ్వాన్నంగా ఉంది. ఒకప్పుడు పారిశుధ్య విభాగంలో రాష్ట్ర స్థాయిలో ఉత్తమ మున్సిపాలిటీగా నిలిచినప్పటికీ ఈరోజు దానికి భిన్నమైన పరిస్థితి కనిపిస్తోంది. గత కొద్ది నెలలుగా పట్టణంలోని చిట్లువీధి, బంగారంపేటలో పారిశుధ్యం తాండవిస్తోంది. నెలల తరబడి చిట్లు వీధిలోని కాలువల్లో నుంచి పూడికలు తీయకపోవడంతో మురుగునీరు రోడ్లపై ప్రవహించే పరిస్థితి నెలకొంది. దోమలు వృద్ధి చెందడంతో తరచూ వీధిలో ఉన్న ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారు. 25వ వార్డు బంగారమ్మపేటలో దళిత కాలనీలో పారిశుధ్యం చెత్తగా కనిపిస్తోంది. నెలల తరబడి ఈ దళితవాడలో నుంచి పేరుకుపోయిన చెత్తలను పారిశుధ్య కార్మికులు తరలించకపోవడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందికి గురవుతున్నారు. ఇంటింటి నుంచి చెత్తలను తరలించకపోవడంతో ప్రజలు చెత్తాచెదారాలను రోడ్డు పక్కన వేస్తున్నారు. ఫలితంగా దండిగాం రోడ్డులో బంగారమ్మపేట దళిత కాలనీ సమీపంలో డంపింగ్ యార్డ్‌ను తలపించేలా చెత్తాచెదారం పేరుకుపోయింది. పారిశుధ్య సిబ్బంది రోడ్డు పక్కన ఉన్న చెత్తలకు నిప్పు పెట్టి చేతులు దులుపేసుకుంటున్నారు. దీని వల్ల ప్లాస్టిక్ సంచులు, డబ్బాలు కాలిపోగా వచ్చిన పొగ దళితకాలనీ వాసులు పీల్చడంతో శ్వాసకోశ సంబంధిత వ్యాధులకు గురవుతున్నారు. దీనిపై స్థానిక కౌన్సిలర్ సింగారపు ఈశ్వరరావు మున్సిపల్ కమిషనర్‌కు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయింది.



బంగారమ్మపేటకు వెళ్లే రోడ్డుపక్కనే పేరుకుపోయిన చెత్త

పర్యవేక్షణ లేని మున్సిపల్ కమిషనర్

మున్సిపాలిటీలో పారిశుధ్య నిర్వహణపై కమిషనర్ సత్యనారాయణ పర్యవేక్షణ కొరవడింది. ఆయన విధుల్లో చేరిన కొత్తలో రెండు, మూడు వార్డుల్లో తిరిగి ఆ తర్వాత నుంచి పూర్తిగా వదిలేశారు. ఫలితంగా పట్టణంలో పారిశుధ్యనిర్వహణ ఎలా జరుగుతున్నదో కమిషనర్ పర్యవేక్షణ చేయడం లేదు. ఫలితంగా పారిశుధ్య విభాగంలో ఎవరికి వారే యమునా తీరు అన్న చందంగా తయారైంది. గత కొద్ది నెలలుగా మున్సిపాలిటీకి రెగ్యులర్ శానిటేషన్ అధికారి లేకపోవడంతో పారిశుధ్య పరిస్థితి రోజురోజుకూ దిగజారుతున్న పరిస్థితి ఏర్పడింది. పారిశుధ్య వాహనాలకు ఇంధనం లేక చెత్తలను తరలించని పరిస్థితి నెలకొంది.

మంత్రి సొంత మున్సిపాలిటీ లో దుస్థితి

టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలు కావస్తోంది. రాష్ట్రంలోని ఎమ్మెల్యేలు, మంత్రులు ఒకటి రెండు నెలల్లోనే వారికి నియోజకవర్గం అభివృద్ధికి ఉపయోగపడే అధికారులను తెప్పించుకున్నారు. అదేవిధంగా మంత్రి సంధ్యారాణి కూడా తన నియోజకవర్గ పరిధిలోని మున్సిపాలిటీ, మండలాలకు సమర్థులైన అధికారులను నియమింపజేసుకుంటారని అందరూ భావించారు. అయితే అందుకు భిన్నంగా మున్సిపాలిటీకి సమర్థ కమిషనర్ తీసుకురావడంలో ఆమె నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఇప్పుడున్న కమిషనర్ సత్యనారాయణ నియామకమైన కొత్తలో ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి కమిషనర్‌ను నియమించడంపై ఆమె అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇప్పుడు మాత్రం ఆమె కమిషనర్ విషయంలో సానుకూల దృక్పథం కనబరుస్తున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి.

ఆశ్రమ పాఠశాలలను సందర్శించిన డిడి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని దుడ్డుఖల్లు, దొరజమ్ము, రేగిడి, గొరడ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలను ఐటిడిఎ డిడి ఆర్.కృష్ణవేణి శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులతో మమేకమయ్యారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు చదువులో ఏ మేరకు పట్టు సాధించారు, ఇప్పటివరకు జరిగే పరీక్షల్లో ఎవరికి ఎంత శాతం మార్కులు వచ్చాయని అడిగి తెలుసుకున్నారు. అంతేకాకుండా వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి, వారికి కూడా మంచి మార్కులు వచ్చేలా కృషి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం భోజనశాల, స్టాక్ రూమ్, మరుగుదొడ్లు, సంబంధిత రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో దుడ్డుఖల్లు ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.శంకర్రావు, వార్డెన్, బి.సురేష్, దొరజమ్ము, రేగి, గొరడ ఆశ్రమ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, జి.గణేష్, టి.రమేష్, రవి, వార్డెన్లు బి.మురళి, జోగులత, ఎన్.దివన్న, సిబ్బంది పాల్గొన్నారు.

కంబరలో ప్రత్యేక వైద్య శిబిరం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని కంబరలో శుక్రవారం స్థానిక వైద్యాధికారి బి.ప్రదీప్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జ్వర పీడితులు, రక్తపోటు, మధుమేహ, తదితర రకాలైన వ్యాధిగ్రస్తులకు, గర్భిణులకు ప్రత్యేక వైద్య తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి, ఎఎన్ఎం, ఆశా కార్యకర్తలు, 104 సిబ్బంది, రోగులు పాల్గొన్నారు.


జెసికి వినతిని ఇచ్చేందుకు వచ్చిన దళమంతపురం గ్రామస్తులు

యుపి పాఠశాలను కొనసాగించాలి

ప్రజాశక్తి - వీరఘట్టం

తమ గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలను కొనసాగించాలని మండలంలోని దళమంతపురం గ్రామానికి చెందిన విద్యార్థుల తల్లిదండ్రులు తల్లిదండ్రులు జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.ఎస్ శోభికకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. తమ పాఠశాలలోని 3,4,5 తరగతి విద్యార్థులను దూర ప్రాంతంలో గల వేరే పాఠశాలకు పంపడంతో ఇబ్బందులు పడతారన్నారు. అలాగే బాలికలు పాఠశాలను మానేసే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కావున కలెక్టర్, జెసి స్పందించి తమ గ్రామంలో పాఠశాలను కొనసాగించాలని కోరారు.


మస్టర్లను పరిశీలిస్తున్న ఎంపిడిఒ త్రివిక్రమరావు

మస్టర్ల పరిశీలన

ప్రజాశక్తి -సీతానగరం

మండలంలోని అంటిపేటలో జరుగుతున్న ఉపాధి పనుల మస్టర్లను ఎంపిడిఒ పి.త్రివిక్రమరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి కూలీలు ప్రభుత్వం నిర్ణయించిన సమయం ప్రకారం పని చేస్తే ఉపాధి వేతనం అందజేస్తారన్నారు. ప్రతి జాబ్ కార్డుకు పని కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రతి కుటుంబంలోనూ వంద రోజులు పని దినాలు పూర్తయ్యే లక్ష్యంతో ప్రభుత్వం ఉందని అందువల్ల ఉపాధి కూలీలు పనుల కోసం దరఖాస్తులు పెట్టుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ సత్యవతి, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

మండల సర్వసభ్య సమావేశం వాయిదా

ప్రజాశక్తి - కొమరాడ

మండల సర్వసభ్య సమావేశం వాయిదా పడినట్లు ఎంపిడిఒ ఎం మల్లికార్జునరావు తెలిపారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరగాల్సిన మండల సర్వసభ్య సమావేశం వాయిదా వేసినట్లు ఆయన విలేకరులకు తెలిపారు. పిడిఎఫ్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున సమావేశం వాయిదా వేసినట్లు తెలిపారు. మళ్లీ ఎన్నికల కోడ్ రద్దయిన తర్వాత మండల సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేస్తామని అధికారులకు, ప్రజాప్రతినిధులకు తెలిపారు.

8, 9 తేదీల్లో హిందీ పరీక్షలు

ప్రజాశక్తి - కురుపాం

స్థానిక జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో 8,9 తేదీల్లో హైదరాబాద్ దక్షిణ భారత హిందీ ప్రచారసభ ఆధ్వర్యంలో విశారద, భూషణ్, విద్వాన్ హిందీ పరీక్షలు నిర్వహిస్తారని హిందీ కేంద్ర వ్యవస్థాపకులు సంతోష్ కుమార్ పండా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షలకు చీఫ్ సూపరింటెండెంట్‌గా ప్రధానోపాధ్యాయులు టి.శంకరరావు, డిపార్ట్‌మెంట్ అధికారిగా ఎంఇఒ సత్యనారాయణ వ్యవహరిస్తారన్నారు. విద్యార్థులు సమయానికి పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని సూచించారు.

దోనుబాయి కూడలి వద్ద సంకల్పం

ప్రజాశక్తి - సీతంపేట

మండల కేంద్రంలో దోనుబాయి జంక్షన్ వద్ద సీతంపేట పోలీసుల ఆధ్వర్యంలో సంకల్పం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ సంజీవ్ మాట్లాడుతూ ప్రతి ఒక్క వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ఉపయోగించుకోవాలని కోరారు. హెల్మెట్ మీకు రక్షణ కవచంలా ఉపయోగపడుతుందన్నారు. సైబర్ నేరాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి అన్నారు.

ఇష్టంతో చదివితే విజయం

ప్రజాశక్తి - సాలూరు

విద్యార్థులు కష్టపడి చదివే కంటే ఇష్టపడి చదివితే విజయం తథ్యమని సైకాలజిస్ట్ డాక్టర్ ఎవి రాజశేఖర్ చెప్పారు. శుక్రవారం స్థానిక డబ్బివీధి మున్సిపల్ హైస్కూల్లో పదోతరగతి విద్యార్థులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. లక్ష్యం నిర్దేశించుకుని దృఢ సంకల్పంతో ముందుకు సాగితే జీవితంలోనైనా, పరీక్షల్లోనైనా విజయం సాధించడం సులువవుతుందని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఎస్.సరోజిని పాల్గొన్నారు.


విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎంఇఒ కోటిబాబు

సామరెల్లి పాఠశాలలో ఎంఇఒ పరిశీలన


ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని సామరెల్లి గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలను ఆ పాఠశాల దత్తత అధికారి, ఎంఇఒ పి.కోటిబాబు శుక్రవారం సందర్శించారు. ఇటీవల జరిగిన పదో తరగతి ఎస్ఎ-1 పరీక్షల్లో మంచి ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందిస్తూ ప్రోత్సాహకాలు బహూకరించారు. విద్యార్థులందరికీ పెన్‌లు అందించి ఈనెల 10 నుంచి జరగబోయే ప్రీఫైనల్ పరీక్షలు బాగా రాయాలని ఆకాంక్షించారు. విద్యార్థులకు మెలకువలు చిట్కాలు మోటివేషన్ క్లాస్ నిర్వహించారు నిర్వహించారు. పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారికి నగదు బహుమతి ప్రకటించారు. విద్యార్థుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని సిబ్బందికి సూచించారు. ప్రధానోపాధ్యాయులు ఎ.భాస్కరరావు, ఉపాధ్యాయులు ఉన్నారు.

ఆర్‌టిసి డిపోలో భద్రతా వారోత్సవాలు

ప్రజాశక్తి - పాలకొండ

స్థానిక ఆర్టీసీ డిపోలో శుక్రవారం భద్రతా మాసోత్సవాల సందర్భంగా డిపో మేనేజర్ పట్నాల వెంకటేశ్వరరావు అధ్యక్షతన ఉద్యోగస్తులకు సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన స్థానిక అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ జివిఎస్‌ఆర్‌కె కుమార్ మాట్లాడుతూ, డ్రైవింగ్ చేసేటప్పుడు మెలకువలతో ఉండాలన్నారు. అధిక వేగం, నిర్లక్ష్యంగా డ్రైవింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్ పనికి రాదన్నారు. బాటసారులను గుర్తించి ప్రధానమైన కూడళ్లలోనూ, స్కూలు జోన్లు, మలుపుల వద్ద జాగ్రత్తగా వాహనాలను నడపాలని ఆర్టీసీ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో డిపో ఎంఎఫ్ఎల్ రాము, ఎడిసి బాసూరి కృష్ణమూర్తి, డ్రైవర్ ఇన్‌స్పెక్టర్ ఎస్ఎం రాజు, పలు యూనియన్ నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న డిఎం వెంకటేశ్వరరావు

వైభవంగా వెంకటేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ట

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మండలంలోని తోటపల్లిలో గల వెంకటేశ్వర స్వామి, కోదండ రామస్వామి దేవస్థానంలో విగ్రహ ప్రతిష్ట శుక్రవారం జరిగింది. దేవాదాయ శాఖ సిజిఎఫ్ నిధుల ద్వారా నిర్మాణం పూర్తి చేసుకున్న ప్రధాన దేవాలయంతో పాటు శ్రీదేవి, భూదేవి ఉపాలయములు, ధ్వజ స్తంభం, తోటపల్లి టెంపుల్స్ డెవలప్మెంట్ సేవా ట్రస్టు వారి సహాయ సహకారముతో నిర్మాణం జరిగిన వినాయక దేవాలయం, ఆంజనేయ స్వామి వారి దేవాలయం, సరస్వతి అమ్మవారి దేవాలయాలు, విగ్రహ, యంత్ర, కలశ, ధ్వజ ప్రతిష్ట కార్యక్రమాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. యంత్ర ప్రతిష్ట, కుంభాభిషేక మహోత్సవం ఉదయం 10.47 గంటలకు రోహిణి నక్షత్రయుత మేష లగ్న పుష్కరాంశమందు పుష్పగిరి పీఠాధిపతులు జగద్గురువులు శ్రీ మదభినవోద్దండ విద్యా శంకర భారతీస్వామి ఆధ్వర్యాన నిర్వహించారు. యంత్ర ప్రతిష్ట ధ్వజ, విగ్రహ శిఖర ప్రతిష్ఠ మహోత్సవం జరిగిన తదుపరి దర్శన దర్శన అనంతరం శ్రీ స్వామి వారి దర్శన భాగ్యం భక్తులకు కల్పించారు. ఈ ప్రతిష్ఠా కార్యక్రమ మహోత్సవంలో దేవాలయ అర్చకులు కలెక్టర్ ఎ.శ్యాం ప్రసాద్, మాజీ చీఫ్ సెక్రెటరీ ఎల్‌వి సుబ్రమణ్యం, జిల్లా దేవాదాయ శాఖ అధికారి ఎస్.రాజారావు, టిటిడిఎస్‌టి సభ్యులు, దేవదాయ శాఖ జిల్లా కార్యాలయ సిబ్బంది రాజు, దేవస్థానం సిబ్బంది , అత్యధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. నేడు శ్రీ స్వామి వారి వార్షిక సామూహిక ఉచిత కళ్యాణ మహోత్సవం సాయంత్రం నుండి నిర్వహించబడును..కావున భక్తులు అత్యధిక సంఖ్యలో పాల్గొని ఆలయ ఆలయ కార్య నిర్వహణ అధికారి వివి సూర్యనారాయణ తెలిపారు.


ధ్వజ స్తంభం వద్ద పూజలు చేస్తున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

ఆరోగ్యం మెరుగుకు డీ-వార్మింగ్ దోహదం

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

రక్తహీనత, పోషకాహారలోపం నివారణ, పిల్లల ఆరోగ్యం మెరుగుకు డీ-వార్మింగ్ డే కార్యక్రమం దోహదపడుతుందని వైద్యారోగ్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్ మోహనరావు పేర్కొన్నారు. జాతీయ నులిపురుగులు నిర్మూలన కార్యక్రమంపై సమన్వయ సమావేశం, అవగాహన కార్యక్రమాన్ని వైద్య, విద్య, అంగన్వాడీ సిబ్బందితో మండలంలోని నర్సిపురం జెడ్‌పి ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశంలో డాక్టర్ జగన్మోహన్ పలు సూచనలు చేశారు. ఈనెల 10న నిర్వహించనున్న డీవార్మింగ్ డేలో 1 నుంచి 19ఏళ్ల వారికి ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్నామన్నారు. కార్యక్రమ నిర్వహణలో నిర్దేశించిన మార్గదర్శకాలను పాటించాలన్నారు. సిబ్బంది దగ్గరుండి పిల్లలు, విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు వేయించాలని, బాగా నమిలి మింగేలా జాగ్రత్త పడాలన్నారు. నులిపురుగుల సంక్రమణ వల్ల పిల్లలో పోషకాహార లోపం, రక్తహీనత, ఆకలి మందగించడం, బరువు తగ్గడం, కడుపు నొప్పి, వాంతులు, వికారం, నీరసం వంటి ఆరోగ్యసమస్యలు ఎదుర్కొంటారని, వాటిని నివారించడానికి ఆల్బెండజోల్ మాత్ర దోహదపడుతుందని తెలిపారు. కావున సిబ్బంది సమన్వయంతో పని చేసి డీవార్మింగ్ కార్యక్రమాన్ని పక్కగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎం. వెంకటనాయుడు, ఎన్.బాలకృష్ణ, డెమో యోగీశ్వరరెడ్డి, ఎపిడెమిక్ ఇఒ సత్తిబాబు, వైద్య సిబ్బంది రాజేశ్వరి, కృష్ణవేణి, అంగన్వాడీ సిబ్బంది విజయలక్ష్మి, సుందరమ్మ, భవాని, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైద్య, ఆరోగ్యసిబ్బంది, పాఠశాల హెచ్‌ఎంలు, అంగన్‌వాడీలు

ప్రమాదం జరగక ముందే స్పందించండి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పట్టణంలోని కొత్త వలస నందమూరి కాలనీ ముందర ఉన్న మున్సిపల్ తాగునీరు సరఫరా చేసే రిజర్వాయర్ అక్కడక్కడ బీటలు వారింది. ఈ రిజర్వాయర్ మీదకు ఎక్కేందుకు ఏర్పాటు చేసిన మెట్లు శిథిలావస్థకు చేరుకోవడంతో పాటు రిజర్వాయర్‌పైన ఉన్న భీమ్ ఎప్పుడు కూలి పోయి ప్రమాద బారిన పడతామోనని మున్సిపల్ తాగునీటి సరఫరా సిబ్బందితో పాటు ఆ ప్రాంతంలో రాకపోకలు సాగించే ఆ కాలనీ వాసులు భయందోళకు గురవుతున్నారు. ఈ రిజర్వాయర్ పట్టణ ప్రజలకు తాగు నీటిసరఫరా కోసం మున్సిపల్ ఇంజినీరింగు అధికారుల పర్యవేక్షణలో 1999లో అప్పటి రాష్ట్ర మంత్రి అశోక్ గజపతిరాజు ప్రారంభించారు. 25 ఏళ్లు దాటినా ఈ రిజర్వాయర్ చిన్న, చిన్న మరమ్మతులకు గురవుతున్నప్పటికీ సంబంధిత మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులు కనీస మరమ్మతులు చేసేందుకు చర్యలు చేపట్టకపోవడంతో శిథిలావస్థకు చేరుకునే పరిస్థితి ఉంది. రిజర్వాయర్ పైకి వెళ్లేందుకు నిర్మించిన మెట్లు శిథిలావస్థకు చేరుకొని మెట్ల పక్కనే ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌పై పడి పెను ప్రమాదం సంభవించే అవకాశం లేకపోలేదు. ఈ విషయంపై స్థానిక కాలనీవాసులు పలుమార్లు వార్డు కౌన్సిలర్ సభ్యులకు, మున్సిపల్ ఇంజనీ రింగ్ అధికారుల దృష్టికి తీసుకు వెళ్లినప్పటికీ, కనీసం రిజర్వాయర్ పరిస్థితిని పర్య వేక్షించిన పాపాన లేదు. కావున అధికారులు స్పంది ంచి ప్రమాదం జరగక ముందే మరమ్మతు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.


శిథిలావస్థలో ఉన్న వాటర్ ట్యాంకు

సర్పంచ్‌కు మాజీ ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని సుమిత్రాపురం గ్రామానికి చెందిన వైసిపి సీనియర్ నాయకులు, సర్పంచ్ బొత్స ఉమామహేశ్వరరావు గత కొంతకాలంగా అనారోగ్య సమస్యతో బాధపడుతున్నారు. ఈ విషయాన్ని తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు శుక్రవారం ఆ గ్రామానికి వెళ్లి సర్పంచ్‌ను పరామర్శించి ఆరోగ్య క్షేమ సమాచారం తెలుసుకున్నారు. పరామర్శించిన వారిలో వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు బలగ శ్రీరాములు నాయుడు, మండల వైసిపి అధ్యక్షులు బొంగు చిట్టి రాజు, జడ్పీటీసీ మామిడి బాబ్జీ, సీనియర్ నాయకులు ఆర్వీ, సర్పంచ్ గుజ్జల దాసు, సీతానగరం, పార్వతీపురం మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పంచగవ్యతో అధిక దిగుబడులు

ప్రజాశక్తి - పాచిపెంట

పూత, పిందె దశలో రెండు సార్లు పంచగవ్య ఎకరానికి రెండు లీటర్లు పిచికారీ చేసుకుంటే అన్ని పంటల నుంచి అధిక దిగుబడులు పొందడమే కాకుండా మంచి నాణ్యత కలిగిన దిగుబడులు వస్తాయని మండల వ్యవసాయ అధికారి కె.తిరుపతి రావు తెలిపారు. మండలంలోని అజరిలో ఎల్ టు విజయ్ కుమార్ ఆధ్వర్యంలో రైతు మర్రి రాజారావు తన జీడి తోటలో పిచికారి కోసం 20 లీటర్ల పంచగవ్యను తయారు చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి మాట్లాడుతూ ఎకరానికి రెండు లీటర్లకు అయ్యే పంచగవ్య ఖర్చు కేవలం వంద రూపాయలు మాత్రమేనని, పూత, పిందె దశల్లో పిచికారీ చేసుకుంటే అత్యధిక దిగుబడులు పొందవచ్చని తెలిపారు. ఇప్పటికే మండలంలోని బొబ్బిలివలస, విశ్వనాథపురం గ్రామాల్లో పంచగవ్యను వినియోగించి మంచి దిగుబడి పొందిన రైతులు ఉన్నారని తెలిపారు. అనంతరం పంచగవ్య తయారీ విధానాన్ని వివరించారు. కార్యక్రమంలో ప్రకృతి సేద్యం ఎల్ వన్ శ్రీను, సురేష్, ఐసిఆర్ పి.కుమార్, రైతులు పాల్గొన్నారు.



పంచగవ్య తయారీని వివరిస్తున్న ఎఒ తిరుపతిరావు

10న ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ

ప్రజాశక్తి - మక్కువ

ఈనెల 10న కిశోర్ బాల బాలికలకు ఉచితంగా ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయనున్నట్లు స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ హరికృష్ణ తెలిపారు. శుక్రవారం స్థానిక ఎంఇఒ సత్యనారాయణతో కలిసి సమావేశయ్యారు. వివిధ పాఠశాలల్లో ఎంతమంది పిల్లలు ఉన్నారన్న విషయాన్ని చర్చించారు. ఒకటి నుంచి 19ఏళ్ల వయస గల వారిలో నులిపురుగుల నివారణ కోసం ఈ మాత్రలు అందజేయనున్నట్లు తెలిపారు. అయితే జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం ఈనెల 10న అంతమంది మాత్రలను చప్పరించి స్వచ్ఛమైన నీటితో వినియోగించాలన్నారు. నులిపురుగులు అధికంగా ఉన్న వారిలో విరోచనాలు, కడుపునొప్పి, తల తిరగడం వంటి కొన్ని లక్షణాలు వచ్చినా భయపడాల్సిన పనిలేదని తెలిపారు. ఈ సమావేశంలో డాక్టర్ ఎం.నిఖిల, సిబ్బంది పాల్గొన్నారు.

ఎంఎస్ఎంఇ సర్వే పరిశీలన

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని మరిపివలసలో ఎంఎస్ఎంఇ సర్వేను ఇఒపిఆర్‌డి కెకె కుమార్ వర్మ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఉండే ప్రతి పాన్‌షాప్‌ను సర్వే చేశామన్నారు. అలాగే గ్రామంలో ఉండే అన్ని ఇళ్లకు వెళ్లి ఇంటింటి సర్వేలు కూడా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పి.మురళీకృష్ణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సీతంపేట : సూక్ష్మ, చిన్నతరహా వ్యాపార సంస్థలు జిల్లా పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో జరిగే సర్వే వ్యాపారులకు సంబంధించిన సర్వేకు దుకాణాలు సచివాలయ సిబ్బందికి సహకరించాలని ఎంపీడీవో కె.గీతాంజలి తెలిపారు. సర్వే ఈనెల 10లోగా ఎమ్మెస్ ఎంఇలో రిజిస్ట్రేషన్ నమోదు చేసుకోవాలని కోరారు.

విశ్రాంత ఇఒ చిత్రపటం అందజేత

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

గరుగుబిల్లి మండలం తోటపల్లి దేవస్థానం ప్రతిష్ట కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన టిటిడి విశ్రాంత ఇఒ ఎల్‌వి సుబ్రహ్మణ్యంకు పెన్సిల్ తో వేసిన చితపటాన్ని జియమ్మవలస మండలం రావాడ రామభద్రపురం పాఠశాలలో పని చేస్తున్న డ్రాయింగ్ టీచర్ రుగడ శ్రీనివాసరావు అందజేశారు. తన చిత్రపటాన్ని చూసిన సుబ్రమణ్యం సంతోషించి అభినందించారు. శ్రీనివాసరావులో ఇంత కళ ఉండడం ఎంత సంతోషంగా ఉందన్నారు.

స్క్రాప్ దుకాణంలో అగ్నిప్రమాదం

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

స్థానిక పాత బస్టాండ్‌లో శుక్రవారం రాత్రి మున్సిపల్ కార్యాలయం ఎదురుగా ఉన్న స్క్రాప్ దుకాణంలో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. పెళ్లిళ్ల ఊరేగింపులో భాగంగా బాణాసంచా కాల్పులతోనే ఈ ప్రమాదం జరిగినట్లు స్థానికులు చెబుతున్నారు. అగ్ని మంటలు ఎగిసి పడడంతో స్థానికులు స్థానిక అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి హుటాహుటిన అగ్నిమాపక సిబ్బంది చేరుకొని మంటలను అదుపు చేశారు. అయితే ఒక్క అగ్నిమాపక శకటంతో మంటలను అదుపుచేయడం కష్టం కావడంతో బొబ్బిలి నుంచి మరో అగ్నిమాపక శకటం వచ్చి మంటలను సిబ్బంది అదుపు చేస్తున్నారు. విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే విజయచంద్ర సంఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు పర్యవేక్షించారు. బాధితుడికి అన్నివిధాలా ఆదుకుంటామని ఆయన హామీ ఇచ్చారు.


మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక శకటం

కార్యాలయానికి చేరని హైడ్రాలిక్ వాహనం

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ప్రజారోగ్యం విభాగానికి సంబంధించిన హైడ్రాలిక్ వాహనానికి మరమ్మతులకు సంబంధించిన బిల్లును మెకానిక్‌కు ఇటీవల సిఎఫ్ఎంఎస్ ద్వారా బిల్లు పడినా ఆ వాహనం మాత్రం కార్యాలయానికి చేరుకోకవడంపై పలు అనుమానాలకు తావిస్తోంది. పట్టణంలో చెత్త సేకరణకు ఏర్పాటు చేసిన కాంపేక్టర్ బిన్‌ల్లో చెత్తలను, వ్యర్థాలను తరలించేందుకు ఉన్న రెండు హైడ్రాలిక్ వాహనాల్లో ఒకటి సుమారు ఏడాది క్రితం మరమ్మతులకు గురైంది. దీంతో మరమ్మతుల నిమిత్తం విశాఖపట్నంలో గల మెకానిక్ షాపుకు అధికారులు పంపించారు. ఈ వాహనానికి మరమ్మతులు పూర్తయి ఇటీవల రూ.1,55,878 బిల్లు సంబంధిత మెకానిక్‌షాప్ యజమానికి పడినప్పటికీ, ఆ వాహనాన్ని మున్సిపల్ కార్యాలయానికి పంపించకపోవడంతో పారిశుధ్య కార్మికులు చెత్తలు, వ్యర్థాలు తరలించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఈ వాహనాన్ని రప్పించేందుకు మున్సిపల్ ఇంజనీరింగు, ప్రజారోగ్య అధికారులు చొరవ చూపకపోవడం గమనార్హం. ఆఖరుకు కౌన్సిలర్లు కూడా దృష్టి సారించకపోవడం దురదృష్టకరమని స్థానికులు విమర్శిస్తున్నారు. ఈ జాప్యం కారణంగా వార్డులో చెత్త, వ్యర్థాలను డంపింగ్ యార్డుకు ఒక్క హైడ్రాలిక్ వాహనంతోనే తరలింపు జరుతుండడంతో పారిశుధ్య కార్మికులకు పని భారం ఎక్కువవుతుంది. ఈ హైడ్రాలిక్ వాహనాన్ని మున్సిపాలిటీకి రప్పించేందుకు పాలక వర్గ కౌన్సిల్ సభ్యులు, ఇంజనీరింగ్, ప్రజారోగ్య అధికారులు టెండరుదారునిపై చర్యలు చేపట్టి మున్సిపల్ కార్యాలయానికి వాహనాన్ని రప్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఉపాధి పనుల్లో మౌలిక వసతులు ఏవీ?

ప్రజాశక్తి - కొమరాడ

మండలంలో ఉపాధిహామీ పనులు చేసే ప్రదేశంలో మౌలిక వసతులు ఎక్కడ ఉన్నాయని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి ప్రశ్నించారు. మండలంలోని ఉపాధి కూలీలు పనులు చేసే చోట ఉపాధి పనులు శుక్రవారం పరిశీలించారు. అనంతరం సాంబమూర్తి విలేకరులతో మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వంలో రెండు పూటలా ఉపాధి పని కల్పించడంలో కూలీలు చాలా ఇబ్బందిపడే పరిస్థితి ఉందన్నారు. వ్యవసాయ పనులు పూర్తయి 2 నెలలు కావస్తోందని, పనులు లేక కూలీలంతా వలసలు వెళ్లి పోతున్నారని అన్నారు. కావున వెంటనే దళితులకు, గిరిజనులకు, పేదలకు ఉపాధి పనులు కల్పించాలని డిమాండ్ చేశారు. మండుటెండలు ప్రారంభమైన నేపథ్యంలో ఒక్క పూట మాత్రమే ఉపాధి పని కల్పించాలని కోరారు. పనులు చేసే చోట కూలీలకు పారలు, గుణపాలు, టార్పన్లు, మంచినీటి సౌకర్యం, తట్టలు, మెడికల్ కిట్ వంటి సౌకర్యాలు కల్పించాలని కోరారు. తక్షణమే కూలీలను కదిలించి భవిష్యత్తులో పెద్ద ఎత్తున కలెక్టరేట్ వద్ద ఆందోళన చేపడుతామని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

ప్రకృతి సంపదను దోచిపెడుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఏజెన్సీలో అమలవుతున్న 1/70 చట్టంపై స్పీకర్ అయ్యన్నపాత్రుడు చేసిన వ్యాఖ్యలపై కురుపాం నియోజకవర్గ కాంగ్రెస్ కోఆర్డినేటర్ అడ్డాకుల చిన్నారావు మండిపడ్డారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సవరణల పేరిట చట్టాలను చుట్టరికంగా మలుచుకుంటూ గిరిజన ప్రాంతాల్లో విదేశీ బహుళ జాతి సంస్థలు పాగా వేసేందుకు కుట్రపూరిత విధానాల అమలుకు బీజం వేసినట్లుగా ఉందని అన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ, సిఎం చంద్రబాబు నాయుడు ఉమ్మడి అజెండాలో భాగంగా పరిశ్రమల స్థాపన, ఉపాధి కల్పన వంటి వినసొంపైన మాటలతో గిరిజనులను ఏమార్చే వ్యూహానికి పదును పెడుతూ ప్రకృతి సంపాదను కొల్లగొట్టేందుకు ఆత్రుతపడుతున్నాయని అన్నారు. ఈనెల 11,12న చేపట్టబోయే గిరిజన సంఘాల బంద్‌కు కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మద్దతు ఇస్తుందని అన్నారు.

ఇంటర్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించాలి

ప్రజాశక్తి - కొమరాడ

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న ఇంటర్ విద్యార్థులు పరీక్షల్లో మంచి ఉత్తీర్ణత సాధించి మండలానికి మంచి పేరు తేవాలని ఆ కాలేజీ ప్రిన్సిపల్ వై.నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సర విద్యార్థుల ఫేర్వెల్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిని, విద్యార్థులు అధ్యాపకులను ఘనంగా సన్మానించారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి ప్రిన్సిపల్ మాట్లాడుతూ రెండేళ్ల పాటు కళాశాలలో చదువుకున్న విద్యార్థులు క్రమశిక్షణగా ఉండేందుకు ప్రతిక్షణం తన వంతు కృషి చేశానని తెలిపారు. విద్యార్థులకు మంచి విద్యా బోధనలు నేర్పించేలా సిబ్బందితో ఎప్పటికప్పుడు సమావేశాలు నిర్వహించి వారి చదువుపైనే దృష్టి సారించేలా కృషి చేశామన్నారు. త్వరలో జరగనున్న ఇంటర్ పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులు కష్టపడి చదివి మంచి మార్కులు తెచ్చుకోవాలని కోరారు. పబ్లిక్ పరీక్షల్లో మంచి ఉత్తీర్ణత ఫలితాలు సాధించి మండలానికి కాలేజీకి మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కమిషన్

ఇంటి పన్ను వసూళ్లు వేగవంతం

ప్రజాశక్తి - పాలకొండ

స్థానిక నగర పంచాయతీ పరిధిలో గల ఇంటి పన్ను వసూలు వేగవంతం చేయాలని నగర పంచాయతీ కమిషనర్ ఎస్.సర్వేశ్వరరావు అన్నారు. శుక్రవారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో ఇంటి పన్ను వసూలుపై అడ్మిన్, కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి పన్ను వసూళ్లలో నిర్లక్ష్యం చెప్పొద్దన్నారు. లక్ష్యాలు పూర్తి చేయాలన్నారు. మొండి బకాయిదారులను గుర్తించి వసూళ్ల దృష్టి పెట్టాలన్నారు. సమావేశంలో మేనేజర్ జయరాం ఉన్నారు.

రబీసాగు పరిశీలన

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని మరుపల్లి, తానసీతారాంపురంలో గల రబీ డ్రై సోవింగ్ వేసిన రైతుల పొలాలను రీజనల్ టెక్నికల్ లీడ్ కె.ప్రకాష్ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్య పంటతో పాటు ఇతర రకాల విత్తనాలు కలిపి వేసుకోవడం వల్ల ప్రీ మాన్సూన్ డ్రై సోవింగ్‌కు కావాల్సిన విత్తనాలను సమకూర్చుకోవచ్చు అన్నారు. ముఖ్య పంటతో ఆకుకూరలు, కూరగాయలు, తీగజాతి విత్తనాలు వేసుకోవడం ద్వారా ఇంటికి కావాల్సిన ఆకుకూరలు, కూరగాయలు పొందవచ్చాన్నారు. అంతేకాక అంతమంది రైతులు ఈ విధానం పాటించడం ద్వారా అనేక రకాల మొక్కలు పొలంలో ఉండడంతో భూమికి కావాల్సిన పలు రకాల పోషకాలు లభిస్తాయని, భూమి గుల్లబారి నేలలో కర్బన శాతం పెరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎఫ్ఎ పి.దేవీప్రసాద్, ఎల్-2 గంగరాజు పాల్గొన్నారు.

రహదారి పనులు ప్రారంభం

ప్రజాశక్తి - మక్కువ

మండలంలో సుమారు రూ.37 కోట్లతో మంజూరైన మక్కువ- చినబోగిలి రహదారి పనులు ప్రారంభమయ్యాయి. గత కొన్నేళ్లుగా ఈ రహదారి పూర్తిగా మరమ్మతులకు గురైంది. గత ప్రభుత్వ హయాంలో పనులు ప్రారంభించి మధ్యలో నిలిపివేశారు. ప్రస్తుత ప్రభుత్వ ఆదేశాలతో సంబంధిత కాంట్రాక్టర్ పనులను వేగవంతం చేశారు. ఈ రహదారి పూర్తి అయితే జిల్లా కేంద్రానికి, మండ లానికి వెళ్లేందుకు ప్రజలకు ఇబ్బందులు తొలగనున్నాయి.

బస్సును ఢీకొన్న లారీ

ప్రయాణికులకు తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి - కొమరాడ

ఎదురెదురుగా వస్తున్న బస్సును లారీ ఢీకొన్న సంఘటన మండలంలో శుక్రవారం జరిగింది. ఈ సంఘటనకు సంబంధించి స్థానిక ఎస్సై నీలకంఠం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమీపాన గల మలుపు వద్ద విశాఖ నుంచి రాయగడ వైపు వెళ్తున్న లారీ కూనేరు నుంచి పార్వతీపురం వైపు వస్తున్న బస్సును శుక్రవారం బలంగా ఢీ కొంది. ఈ ప్రమాదంలో బస్సు డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో ప్రాణనష్టం తప్పింది. ఈ ప్రమాదాన్ని ముందుగానే గ్రహించి బస్సును రోడ్డుకు దిగు భాగం వైపు డ్రైవర్ నడపడంతో బస్సులో ఉన్న ప్రయాణికులకు ఎవరికీ ఎటువంటి ప్రాణనష్టం జరగలేదు. ప్రమాద సమయంలో బస్సులు సుమారు 19 మంది ప్రయాణికులతో పాటు బస్సు డ్రైవర్, కండక్టర్ ఉన్నారు. లారీ మితిమీరిన వేగంతో మలుపు వద్ద అదుపుతప్పి ఎదురుగా వస్తున్న బస్సును పక్క భాగం నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో లారీ ముందు భాగం పూర్తిగా నుజ్జునుజ్జయ్యి పోగా, బస్సు కుడివైపు భాగం ధ్వంసమైంది.



ప్రమాదంలో నుజ్జయిన వాహనం